# చట్టం

సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక

నిజామాబాద్
గురువారం
29.05.2025

సంపుటి : 15 సంచిక: 257
పేజీలు: 6 వెల: రూ.5

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్




## టాప్2లో బెంగళూరు

పాయింట్ల పట్టికలో టాప్-2 లక్ష్యంగా ఈ సీజన్‌లో ఆఖరి లీగ్ మ్యాచ్ ఆడిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ).. కీలక పోరులో బంతితో విఫలమైనా బ్యాట్‌తో దుమ్మురేపింది. మంగళవారం లక్నో వేదికగా లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు.. ఆరు వికెట్ల తేడాతో ప్రత్యర్థిని ఓడించింది. లక్నో నిర్దేశించిన 228 పరుగుల భారీ ఛేదనను బెంగళూరు.. 18.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి దంచేసింది. ఛేదనలో తాత్కాలిక సారథి జితేశ్ శర్మ (33 బంతుల్లో 85 నాటౌట్, 8 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపులకు తోడు విరాట్ కోహ్లీ (30 బంతుల్లో 54, 10 ఫోర్లు), మయాంక్ అగర్వాల్ (23 బంతుల్లో 41 నాటౌట్, 5 ఫోర్లు) రాణించారు.

# కులంతో గుర్తింపు రాదు

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### బడుగు, బలహీన వర్గాలు ఆత్మన్యూనత భావం వీడాలి
### చదువే ఉన్నత స్థాయికి చేర్చుతుంది
### ప్రజల ఆత్మగౌరవమే మా ప్రభుత్వ లక్ష్యం: డిప్యూటీ సీఎం భట్టి
### ఎస్సీ గురుకుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



**చట్టం, హైదరాబాద్:** కులంతో గుర్తింపు రాదని, చదువుతోనే గుర్తింపు వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని బాబు జగ్జీవన్ రాంభవన్‌లో సోషల్ వెల్ఫేర్ గురుకులాల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవంలో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. మే 28 తెలంగాణ వైతాళికుడు, సురవరం ప్రతాపరెడ్డి జయంతి అని, ఆయన స్ఫూర్తిని కొనసాగించేందుకు తెలుగు యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టుకున్నామని తెలిపారు. మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ, టెక్స్‌టైల్ యూనివర్సిటీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేర్లు పెట్టుకున్నామన్నారు. ప్రజల కోసం పాటుపడిన వారే చరిత్రలో నిలిచిపోతారని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జవహర్ లాల్ నెహ్రూ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను కాంగ్రెస్ కొనసాగిస్తోందని, కులంతో ఎవ్వరికి గుర్తింపు రాలేదన్నారు. దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలు ఆత్మన్యూనత భావాన్ని వీడాలని, వారి కోసం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్‌ను చూశారా?**

గత పదేళ్లలో నాటి సీఎం కేసీఆర్‌ను కలసిన వాళ్లు చేతులెత్తాలని ముఖ్యమంత్రి రేవంత్ సూచించగా ఒక్కరు కూడా స్పందించలేదు. ఇదే ప్రజా ప్రభుత్వానికి, దొరల ప్రభుత్వానికి ఉన్న తేడా అని సీఎం రేవంత్ తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు బర్రెలు, గొర్రెలు, చేపల పంపిణీ లాంటి స్కీంలు ఇచ్చారని.. కానీ, మీకు చదువు చెప్పి రాజ్యాధికారంలో భాగస్వాములను చేస్తామని ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి యూనివర్సిటీ విద్య వరకు విద్యార్థులను పంపిస్తే.. ఇక్కడ పీజీలు, పీహెచ్‌డీలు చేసి మళ్లీ గొర్లు, బర్లను కాసేలా గత ప్రభుత్వం స్కీములు రూపొందించిందన్నారు. నిరుద్యోగులకు గత పదేళ్లుగా నోటిఫికేషన్లు లేకపోవడంతో వారి పదేళ్ల జీవితం నాశనమైందన్నారు. 2011 తర్వాత గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించలేదని, నిరుద్యోగుల ఇబ్బందులు చూడలేక ప్రజా ప్రభుత్వంలో గ్రూప్స్ పరీక్షలు నిర్వహించి ఫలితాలు విడుదల చేశామని సీఎం రేవంత్ తెలిపారు. రాజకీయ కుట్రతో నియామక పత్రాలు ఇవ్వకుండా అడ్డుకున్నారని గుర్తుచేశారు. కొన్ని రాజకీయ శక్తులు ఉద్దేశపూర్వకంగా కోర్టుల్లో కేసులు వేశారన్నారు. తమ ప్రజా ప్రభుత్వం మొదటి ఏడాదిలోనే 59 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. మొదటి ఏడాదిలోనే ఇన్ని ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని సీఎం చెప్పారు. కేవలం ప్రభుత్వ ఉద్యోగాలతో ఉపాధి కల్పన సాధ్యం కాదన్న ఉద్దేశంతో ప్రైవేట్ కార్పొరేట్ సంస్థల్లోనూ లక్ష ఉద్యోగాలు కల్పించామన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే పిల్లలు అన్ని రంగాల్లో రాణిస్తారని, 29 వేలకు పైగా ఉన్న ప్రభుత్వ స్కూల్స్‌లో 24 లక్షల మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 11 వేలకు పైగా ఉన్న ప్రైవేట్ విద్యాసంస్థల్లో మాత్రం 36 లక్షల మంది విద్యార్థులు ఉండటంపై అందరూ ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు.

**దళితులకు అండగా ప్రజా ప్రభుత్వం**

విద్యార్థులు పాతికేళ్ల వయస్సు వరకు బాగా చదువుకోవాలని, తప్పుదారి పట్టి తల్లిదండ్రులు తలదించుకునే పరిస్థితులు తీసుకురావొద్దని సీఎం రేవంత్ సూచించారు. 'ప్రభుత్వం మీకు అండగా ఉంది. మీరు కష్టపడండి. ఆత్మ విశ్వాసంతో రాణించి తల్లిదండ్రులకే కాదు రాష్ట్రానికి గర్వకారణంగా నిలవాలి' అని సూచించారు. వందేళ్ల ఉస్మానియా యూనివర్సిటీ చరిత్రలో తొలిసారిగా దళితుడిని వీసీగా నియమించిన ఘనత ప్రజా ప్రభుత్వాదే అన్నారు. విద్యా కమిషన్ చైర్మన్‌గా మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళిని నియమించామని, అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్‌ను ప్రజా ప్రభుత్వంలో ఎంపిక చేసుకున్నామన్నారు. గత ప్రభుత్వం దళితుడిని సీఎం చేస్తానని అవమానించిందని, అందుకే స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ నియమించామని చెప్పారు. 'వీళ్లందరికీ ఈ గౌరవం కేవలం కులం ప్రాతిపదికన రాలేదు. ఉన్నత విద్య చదివినందుకే ఈ గుర్తింపు వచ్చింది. కులంతో అవకాశాలు రాలేదు.. చదువుతోనే అందరూ ఇక్కడి వరకు వచ్చారన్నారు. మన దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉంది. అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

### గత ప్రభుత్వం సర్కార్ బడులను పట్టించుకోలే..

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ రెసిడెన్షియల్స్ స్కూల్స్‌లో చదువుకునే విద్యార్థులు ఉన్నత విద్యా సంస్థల్లో సీట్లు సాధించడం గర్వకారణం అన్నారు. వారికి ల్యాప్‌టాప్స్, నగదు అందజేసి ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. సామాజిక తెలంగాణతో పాటు ఆత్మగౌరవం కోసం ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని చెప్పారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అంకితమని.. దొరలు, దయ్యాలకు కాదన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌కు నిధులు కేటాయించకుండా పక్కన పెట్టేశారని భట్టి గుర్తుచేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలోనే రూ.1,996 కోట్ల ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు క్యారీ ఫార్వర్డ్ చేశామన్నారు. వెనుకబడిన వర్గాలను అభివృద్ధి చేసేందుకే కులగణన చేశామన్నారు. వందకు పైగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను రూ.250 కోట్లతో నిర్మిస్తున్నామని చెప్పారు. యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా రూ.8 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని తీసుకొచ్చామన్నారు. రూ.12,500 కోట్లతో గిరిపుత్రులకు భూములకు హక్కుదారులను చేసేందుకు ఇందిరా సౌర జల వికాసం పథకం తీసుకొచ్చామని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు మల్లురవి, కడియం కావ్య, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, కేఆర్ నాగరాజు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, సోషల్ వెల్ఫేర్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, ఎస్సీ గురుకులాల సెక్రటరీ, అలగు వర్షిణి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నదుల అనుసంధానంతో
# తెలంగాణకూ లాభమే

- కాళేశ్వరంపై నేనెన్నడూ అభ్యంతరం చెప్పలేదు
- బీఆర్ఎస్‌ది తప్పుడు ప్రచారం
- 'బనకచర్ల'తో ఆ రాష్ట్రానికి నష్టం జరగదు
- హైదరాబాద్ అభివృద్ధిలో నా పాత్ర చాలా కీలకం
- మహానాడులో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

**చట్టం, కడప** : తెలుగు రాష్ట్రాలు తనకు రెండు కళ్లని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నాడు. కడప వేదికగా జరుగుతున్న మహానాడులో రెండోరోజు బుధవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ గురించి ప్రస్తావించారు. నదుల అనుసంధానంతో తెలంగాణకూ లాభమేనని చెప్పారు. అక్కడ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై తానెప్పుడూ అభ్యంతరం చెప్పలేదని స్పష్టం చేశారు. అయితే ఆ అంశంలో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని, అందులో ఎలాంటి నిజం లేదని వ్యాఖ్యానించారు. బనకచర్ల ప్రాజెక్టుతోనూ తెలంగాణకు నష్టం జరగదన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో తన పాత్ర చాలా కీలకమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నదీ జలాల వినియోగంలో ఆంధ్రప్రదేశ్ చివరి రాష్ట్రమని, రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీళ్లు ఇచ్చే లక్ష్యంగా పని చేస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు.


## మరోసారి కేసీఆర్, హరీశ్ భేటీ

### ఎర్రవల్లి ఫాంహౌస్‌లో 4 గంటల పాటు చర్చలు





**చట్టం, హైదరాబాద్:** మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మరోసారి భేటీ అయ్యారు. బుధవారం ఎర్రవల్లి ఫాంహౌస్‌లో వీరిద్దరూ దాదాపు 4 గంటలు పాటు పలు విషయాలపై చర్చించారు. భేటీలో కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ జారీ చేసిన నోటీసులు, విజిలెన్స్ నివేదిక, బ్యారేజీ లోపాలు, ఎన్‌డీఎస్‌ఏ అంశాలపై కేసీఆర్ ప్రధానంగా చర్చించినట్టు సమాచారం. ఎమ్మెల్సీ కవిత ఎపిసోడ్‌పైనా ఇద్దరి మధ్య చర్చ జరిగినట్టు తెలిసింది. నివేదికల్లో పేర్కొన్న లోపాలు, సాంకేతిక సమస్యల గురించి కేసీఆర్ ఆరా తీశారని తెలుస్తోంది. కమిషన్ ముందు ఇప్పటికే హాజరైన కొంతమంది రిటైర్డ్ ఇంజినీర్లతో ఆయన ఫోన్లో మాట్లాడారు. కమిషన్ అడిగిన ప్రశ్నలు, ఇంజినీర్లు ఇచ్చిన సమాధానాలు తెలుసుకున్నారు. ప్రాజెక్టు స్థల ఎంపిక, డిజైన్ మార్పులు, నిర్మాణ నిర్ణయాలు కేటీఆర్ సూచనల మేరకే జరిగాయని అధికారులు చెప్పినట్టు తెలుస్తోంది. కాగా.. జూన్ 5న కేసీఆర్, 6న హరీశ్‌రావు, 9న మాజీ మంత్రి ఈటల రాజేందర్ విచారణకు హాజరు కావాలని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. 2024 మార్చిలో ఏర్పాటైన ఈ కమిషన్ ఇప్పటి వరకు వంద మందికి పైగా అధికారులను విచారించింది. కాగా, విచారణ గడువు ఈ ఏడాది జులై 31 వరకు మరోసారి పొడిగించారు.



## పనిచేసినోళ్లకే పదవులు

- మీనాక్షి నటరాజన్‌కు తేల్చి చెప్పిన కాంగ్రెస్ నాయకులు
- వర్గీకరణ ప్రకారం మంత్రి పదవి ఇవ్వాలి: మాదిగ సామాజిక నేతలు
- పదవులు, క్షేత్రస్థాయి పరిస్థితులపై మీనాక్షి ఆరా
- మంత్రి, ఎంపీ మధ్య కాళేశ్వరం ప్రోటోకాల్ వివాదంపై గుస్సా
- సమస్యలపై చర్చ.. పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన

**చట్టం, హైదరాబాద్:** పార్టీ అధికారంలోకి తీసుకురావడానికి ఇన్నేళ్లు కష్టపడి పనిచేసిన నాయకులకే కీలక పదవులు ఇవ్వాలని, పార్టీ మారినోళ్లకు కాదని ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఎదుట కాంగ్రెస్ నాయకులు కుండబద్దలు కొట్టారు. ఎస్సీ వర్గీకరణ ప్రకారం మాదిగల జనాభా ఆధారంగా కేబినెట్ విస్తరణలో మంత్రి పదవి కేటాయించాలని మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు నటరాజన్‌ను కోరారు. మంత్రి వర్గ విస్తరణ, పీసీసీ కార్యవర్గ కూర్పు అంశంపై అధిష్టానంతో రాష్ట్ర అగ్రనేతల సంప్రదింపులు ఉత్కంఠగా మారాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ నేతలతో ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సమావేశమయ్యారు. బుధవారం హైదర్‌గూడలోని క్యాంపు కార్యాలయంలో పార్లమెంట్ నియోజక వర్గాల వారీగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో ఆమె సమీక్ష నిర్వహించారు. బుధవారం ఆదిలాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్, జహీరాబాద్, మెదక్, మల్కాజిగిరి లోక్‌సభ స్థానాల నేతలతో మీనాక్షి భేటీ అయ్యారు. రాష్ట్రంలో 119 నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, పోటీ చేసిన అభ్యర్థులతోనూ విడివిడిగా మాట్లాడి.. ప్రభుత్వం, నేతల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోనున్నట్టుతెలుస్తోంది. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి ఏ విధంగా తీసుకెళ్లాలి, నియోజక వర్గాల్లో పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటడంపై ఈ భేటీలో చర్చించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, నేడు(గురువారం) నల్లగొండ, భువనగిరి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, హైదరాబాద్, సికింద్రాబాద్, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, చేవెళ్ల అభ్యర్థులతో మీనాక్షి నటరాజన్ సమావేశం కానున్నారు.

# కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు పాండ్యా కమిటీ

### మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పటిష్టతపై అధ్యయనం
### కేంద్ర జల సంఘం మాజీ చైర్మన్ ఏబీ పాండ్యా నేతృత్వం
### మొత్తం 9 మంది నిపుణులతో కమిటీ



**చట్టం, హైదరాబాద్:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని కీలకమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ, భవిష్యత్ కార్యాచరణపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై సమగ్రంగా అధ్యయనం చేసి, ప్రభుత్వానికి సూచనలు అందించేందుకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ ఏబీ పాండ్య చైర్మన్‌గా ఉన్నతస్థాయి నిపుణుల కమిటీ ఏర్పాటు చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీలో చైర్మన్‌తో పాటు ఏడుగురు సభ్యులు, ఇద్దరు ప్రత్యేక ఆహ్వానితులు ఉంటారు. జాతీయ ఆనకట్టల భద్రత పర్యవేక్షణ సంస్థ (ఎన్డీఎస్ఏ) ఇప్పటికే ప్రభుత్వానికి తుది నివేదిక అందజేసినా.. తర్వాతి చర్యల్లో జాప్యం జరుగుతోందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. బ్యారేజీల విషయంలో తక్షణ కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించిన నేపథ్యంలో ఈ కమిటీ ఏర్పాటు ప్రాధాన్యం సంతరించుకుంది.

**పాండ్యా కమిటీ కార్యాచరణ**

పాండ్యా నిపుణుల కమిటీ ప్రధానంగా కేంద్ర జల సంఘం, పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్(సీడబ్ల్యూపీఆర్ఎస్) సలహాలు తీసుకుంటూ కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణపై దృష్టి సారించనుంది. బ్యారేజీలకు చేపట్టాల్సిన పరీక్షలు, ఇతర చర్యలపై ప్రభుత్వానికి సూచనలు చేస్తుంది. ఎన్డీఎస్ఏ నివేదిక అనంతరం చేపట్టాల్సిన చర్యలపై నీటిపారుదల శాఖ ఈఎన్సీ కార్యాలయం ఇప్పటికే ప్రభుత్వానికి సమర్పించిన కార్యాచరణ ప్రణాళికను కూడా ఈ కమిటీ పరిగణనలోకి తీసుకుంది.

**కమిటీ పరిశీలించే అంశాలు**

కుంగిన మేడిగడ్డ ఏడో బ్లాకులోని పియర్స్‌తో పాటు బ్లాక్ మొత్తాన్నీ తొలగించి, పునర్నిర్మించేందుకు అనుభవజ్ఞులైన ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించడం, ఇతర బ్లాకులకు నష్టం కలగకుండా చూడటం. అదేవిధంగా మూడు బ్యారేజీల్లోని పగుళ్లను గుర్తించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వాటిని భర్తీ చేయడం. దీనివల్ల పునాదుల్లో వచ్చే మార్పులను అంచనా వేసి, స్ట్రక్చరల్ అధ్యయనాలు చేయడం. దీంతో పాటు నదీ ప్రవాహ ప్రభావాన్ని సరిగ్గా అంచనా వేసి, అందుకు అనుగుణంగా డిజైన్లలో అవసరమైన మార్పులు చేయడం. ముఖ్యంగా మేడిగడ్డ ఏడో బ్లాక్ పునర్నిర్మాణంలో నీటి విడుదల శక్తిని తట్టుకునేలా డిజైన్లు రూపొందించడం. బ్యారేజీలపై పడే లోడు, పర్యావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక అధ్యయన పద్ధతులు అనుసరించడం. నీటి ఒత్తిడిని తగ్గించడం, సీపేజీ సమస్యలను అధిగమించడం. బ్యారేజీల దిగువన స్టిల్లింగ్ బేసిన్‌ల విస్తరణ, అదనపు నిర్మాణాలు చేపట్టడం. దెబ్బతిన్న కట్ ఆఫ్‌లను ఆధునిక గ్రౌటింగ్ పద్ధతులతో సరిచేయడం లేదా కొత్తగా డయాఫ్రం వాల్ నిర్మించడం.

## యువత జీవితాల్లో వెలుగులు నింపాలి

- లబ్ధిదారుల పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులు
- జూన్ 2న రాష్ట్రవ్యాప్తంగా మంజూరు పత్రాలు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- 'రాజీవ్ యువ వికాసం' అమలుపై కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్

**చట్టం, హైదరాబాద్:** యువత ఉజ్వల భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల పెట్టుబడి సాయం చేస్తోందని, తద్వారా వారి జీవితాల్లో వెలుగులు నిండటంతో పాటు రాష్ట్ర జీడీపీ సైతం పెరుగుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి రాజీవ్ యువ వికాసం పథకం అమలుపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం కలెక్టర్లకు పలు కీలక సూచనలు చేశారు. 'గత పదేళ్లలో కార్పొరేషన్ల ద్వారా మొక్కుబడిగా కార్యక్రమాలు నిర్వహించారు. కానీ, ప్రజా ప్రభుత్వం మనసు పెట్టి రూపొందించిన రాజీవ్ యువ వికాసం పథకం గతానికి చాలా భిన్నంగా ఉంటుంది' అని భట్టి అన్నారు. మొత్తం రూ.8 వేల కోట్ల పెట్టుబడితో 5 లక్షల మంది యువతకు ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో పెద్ద ఎత్తున మానవ వనరుల వినియోగం జరుగుతుందని తెలిపారు. వ్యాపార కార్యకలాపాలు విస్తృతంగా జరుగుతాయని, దీంతో రాష్ట్ర జీడీపీ పెద్ద ఎత్తున పెరిగే అవకాశం ఉందన్నారు.

**పథకం విజయవంతం చేయాలి**

రాజీవ్ యువ వికాసం పథకం విజయవంతం చేయడంలో అధికార యంత్రాంగం కీలకంగా వ్యవహరించాలని డిప్యూటీ సీఎం భట్టి సూచించారు. ఆర్థిక సహాయం అందించాం, పని పూర్తయింది అనేలా కాకుండా లబ్ధి పొందిన యువత లాభాలు ఆర్జిస్తున్నారా? లేదా?, చిన్నచిన్న ఇబ్బందులతో వ్యాపారం నిర్వహించలేకపోతే అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 'ఐకేపీల్లో సపోర్టు సిస్టం చక్కగా కొనసాగుతుంది. అదే తరహాలో రాజీవ్ యువ వికాసం ద్వారా లబ్ధి పొందిన వారిని నిరంతరం పర్యవేక్షించేందుకు, అవసరమైన సహాయం చేసేందుకు మండల స్థాయిలో ప్రత్యేక అధికారిని నియమించాలి' అని డిప్యూటీ సీఎం సూచించారు. మొదటి సంవత్సరం ఈ పథకాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని భవిష్యత్తులో మరింతగా విస్తరించుకుందామని అధికారులకు సూచించారు. 'కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో పదేళ్ల పాటు యువత ఆశలు అడియాశలుగా మిగిలిపోయాయి. వారి జీవితాల్లో భరోసా కల్పించాలన్న ఆలోచనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నాతో పాటు కేబినెట్ సహచరుడు మంత్రి పొన్నం ప్రభాకర్, అప్పటి ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రామకృష్ణారావు సుదీర్ఘ ఆలోచనలు చేసి రాజీవ్ యువ వికాసం పథకానికి రూపకల్పన చేశాం' అని డిప్యూటీ సీఎం వివరించారు. ప్రభుత్వ ఆలోచనను అర్థం చేసుకొని సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, బీసీ వెల్ఫేర్ సెక్రటరీ శ్రీధర్, ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీ శరత్, కార్పొరేషన్ల ఎండీలు స్పందించి పథకాన్ని చివరి దశకు చేర్చినందుకు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు భట్టి తెలిపారు. ఇదే కమిట్‌మెంట్‌తో ముందుకెళ్తే ప్రభుత్వం ఆశించిన ఫలితాలు వంద శాతం సాధిస్తామన్నారు. జూన్ 2న సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల మధ్య ప్రతి నియోజకవర్గ కేంద్రంలో రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు శాంక్షన్ లెటర్లు అందజేయాలని ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్లు తీసుకొచ్చిందని, అందుకు అనుగుణంగా రాజీవ్ వికాసం లబ్ధిదారుల ఎంపిక ఉండాలన్నారు. పథకం కోసం బీసీ జనాభా దామాషా ప్రకారం ఎంపిక చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ శ్రీధర్ పాల్గొన్నారు.





# రైతుకు కేంద్రం వరాలు

### మద్దతు ధర పెంచిన మోడీ సర్కార్
### వరి సహా 14 పంటలకు ఎమ్మెస్పీ పెంపు
### ఖరీఫ్ సీజన్.. క్వింటాల్‌పై రూ.69లు
### రైతులకు వడ్డీ రాయితీ కింద రూ.15,642 కేటాయింపు
### కేబినెట్ నిర్ణయాలను ప్రకటించిన అశ్వినీ వైష్ణవ్

**చట్టం, న్యూఢిల్లీ:** కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ ఖరీఫ్ సీజన్ సందర్భంగా రైతులపై వరాల జల్లు కురిపించింది. వరి సహా 14 పంటలకు మద్దతు ప్రకటించింది. పంటలకు కనీస మద్దతు ధర(ఎమ్మెస్పీ) 50 శాతానికి పెంచింది. బుధవారం ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకుంది. సమావేశం అనంతరం కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా గత పది పదకొండేళ్లలో ఖరీఫ్ పంటలకు ఎమ్మెస్పీ భారీగా పెరిగిందన్నారు. ఈక్రమంలో 202526 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు ఎమ్మెస్పీ పెంపునకు కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు.

**వరి క్వింటాల్‌కు రూ.69**

202526 ఖరీఫ్ సీజన్‌కు వరి క్వింటాల్‌కు కేంద్రం రూ.69లు మద్దతు పెంచింది. తాజా పెంపుతో ధర రూ.2,369కు పెరిగిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. 'రైతులకు వడ్డీ రాయితీ కింద రూ.15,642 కేటాయించాం. జొన్నలు క్వింటాల్‌కు రూ.328, సజ్జలు రూ.150, రాగులు రూ.596, మొక్కజొన్న రూ.175 పెరిగింది. కందిపప్పు క్వింటాల్‌కు రూ.450, పెసర్లు రూ.86, మినుములు రూ.400, వేరుశెనగ రూ.480 పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది' అని అశ్విని వైష్ణవ్ తెలిపారు. పొద్దుతిరుగు క్వింటా రూ.441, సోయాబీన్ రూ.436, కుసుములు రూ.579, వలిసెలు రూ.820, పత్తి రూ.589 పెంతో పాటు నువ్వులు క్వింటాల్‌కు రూ.579 పెంచినట్లు ఆయన పేర్కొన్నారు. వీటితో పాటు బద్వేల్, నెల్లూరు నాలుగు వరుసల రోడ్డుకు రూ.3,653 కోట్టు కేటాయించామన్నారు. ఈ ప్రాజెక్టులో ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణపట్నం ఓడరేవుకు, హెచ్‌హెచ్67లోని ఓ భాగానికి ఓడరేవు కనెక్టివిటీ, ఆంధ్రప్రదేశ్‌లోని మూడు పారిశ్రామిక కారిడార్ల కలుపనుంది. దాదాపు 108 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారి నిర్మాణం జరగనుండగా.. వార్ధా, బల్లార్షా నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి సైతం కేంద్రం పచ్చజెండా ఊపింది.

చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక

# ఒక్క సారి చల్ల బడ్డ వాతావరణం



చట్టం : రోహిణి కార్తెలో ఎండలకు రోళ్లు పగులుతాయని పెద్దలు అంటుంటారు. సాధారణంగా మే నెలలో ఎండలు తారెత్తిస్తాయి. ఈ నెల 25 నుంచే రోహిణి కార్తె మొదలైంది. ఎండాకాలం చివరిలో పలు ప్రాంతాల్లో 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యేవి. మండే ఎండలకు జనం ఉక్కిరి బిక్కిరి అయ్యేవారు. ఈ రోహిణిలో రోళ్లు పగిలే అవకాశం లేదు 16ఏళ్ల తర్వాత ముందస్తు రుతుపవనాలు వచ్చాయి రోహిణి కార్తెలో ఎండలకు రోళ్లు పగులుతాయని పెద్దలు అంటుంటారు. సాధారణంగా మే నెలలో ఎండలు తారెత్తిస్తాయి. ఈ నెల 25 నుంచే రోహిణి కార్తె మొదలైంది. అన్ని జిల్లాల్లో ఎండాకాలం చివరిలో పలు ప్రాంతాల్లో 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యేవి. మండే ఎండలకు జనం ఉక్కిరి బిక్కిరి అయ్యేవారు. ఎండ వేడిమికి తట్టుకోలేక వడ దెబ్బకు ప్రాణాలు కోల్పోయేవారు.గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది వేసవి ప్రత్యేకతలను సంతరించుకుంది. ఎండల్లో హాయ్‌హాయ్.. అనే పరిస్థితి ఏర్పడింది. ఏప్రిల్‌లో విజృంభించే వేసవి ఛాయలు ఈసారి ఫిబ్రవరి నెలాఖరులోనే మొదలయ్యాయి. మే నెలలో మలమలా మాడ్చాల్సిన మండుటెండలు మనసు మార్చుకుని వర్షాలు కురిపిస్తున్నాయి. భయపెట్టే తీవ్ర వడగాడ్పులు జాడే లేకుండా పోయాయి. ఇక జూన్ ఆరంభంలోనే తాకాల్సిన నైరుతి రుతుపవనాలు ఎనిమిది రోజుల ముందుగానే కేరళలోకి ప్రవేశించాయి. అన్నింటికీ మించి రోళ్లు పగిలేలా ఎండలు ఉంటాయని చెప్పుకునే రోహిణి కార్తెలో చల్లని వాతావరణం ఏర్పడింది. మరోవైపు వచ్చే వారం పది రోజుల పాటు అల్పపీడనం, రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తూ పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 35డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని వాతావరణశాఖ తాజాగా ప్రకటించింది. ఈ ఏడాది వేసవిలో మొత్తం ఉమ్మడి జిల్లాలో 43 డిగ్రీలకు మించి గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదుకాలేదు. అదికూడా ఏప్రిల్ నెలలోనే నమోదయ్యాయి. ఈ సారి మే నెలలో 45డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు చేరుకుంటాయని వాతావరణ నిపుణులు తొలుత అంచనా వేశారు. కానీ, మారిన వాతావరణ పరిస్థితులతో అందుకు భిన్నంగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి. అయితే ఎండాకాలంలో అకాల వర్షాలు, ఈదురుగాలులతో ఉత్తర తెలంగాణ నల్గొండ జిల్లా లో పంటలు దెబ్బతిన్నాయి. రైతులు సుమారు కోట్లాది మేరకు పంట నష్టాన్ని చవిచూశారు. కాగా, ఈ సారి వడదెబ్బ మరణాలు కూడా చాలా తక్కువగా నమోదయ్యాయి. గతంలో నైరుతి రుతుపవనాలు నిర్ణీత సమయం కంటే కొన్నిరోజులు ముందుగానే కేరళను తాకిన తరువాత కొద్దిరోజులకు వాతావరణం



చల్లబడేది. రోహిణి కార్తె వేళ ఉష్ణతీవ్రత ఉండేద ని వాతావరణ నిపుణులు వెల్లడిస్తున్నారు. అయితే ఈ ఏడాది మాత్రం అందుకు భిన్నంగా మే నెలంతా కూడా వర్షాలు, మబ్బులతో చల్లదనాన్ని పరిచింది. గడిచిన ఏళ్లలో ఇలాంటి కూల్ సమ్మర్‌ను చూడలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎప్పుడైనా మే నెలలో తుఫాన్లు ఏర్పడితే ఐదారు రోజులు చల్లదనం ఉండేది తప్ప ఇంతలా ఎప్పుడూలేదు. 2009లో నైరుతి రుతుపవనాలు తొమ్మిది రోజులు ముందుగా రాగా, ఆ తర్వాత కూడా కొన్నాళ్ల పాటు ఎండలు ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల ప్రకారం ఈ ఏడాది సెప్టెంబరుకు ముందే తుపాన్లు వచ్చే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రుతుపవనాలు ముందుగానే ప్రవేశిస్తే మంచి వర్షాలు కురిసేందుకు అనుకూల పరిస్థితులు ఉంటాయని వాతావరణశాఖ వెల్లడిస్తోంది. తొలకరి పలకరించడంతో పంటలను సాగు చేసేందుకు రైతన్నలు సిద్ధమవుతున్నారు. వానాకాలం పంటలను ముందస్తుగానే సాగుచేసేందుకు సన్నద్ధమవుతున్నారు. వరి నూర్పిడి పను లు చేసిన రైతులంతా దుక్కులు దున్ని, చేలను సిద్ధం చేస్తున్నారు. ఈ సీజన్‌లో వానాకాలంలో కోట్ల ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచింది. అందులో వరి, పత్తి అధికంగా సాగయ్యే అవకాశం ఉంది. సాధారణంగా వరి ఎక్కువగా సాగుకానుంది. ఈసారి పత్తి కూడా లక్షల ఎకరాల వరకు సాగుచేసే అవకాశం ఉందని అంచనా వేసిన అధికారులు విత్తనాలు సిద్ధంగా ఉంచారు. కూరగాయల తోటలు సాగవుతుండగా, ఈసారి కూరగాయల సాగును పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పత్తి చాలా ఎకరాల్లో సాగుకానుండగా, అందుకోసం పత్తి విత్తనాల ప్యాకెట్లు సిద్ధంగా ఉంచారు. ఈ సారి పంటలు సాగుబడి ఎలా ఉంటుందో అని రైతులు హైరానా పడుతూ వున్నారు.

**కామిడి సతీష్ రెడ్డి భూపాల్ పల్లి జిల్లా**

## ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణానికి 200 కోట్ల నిధులు మంజూరు

▶ **ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటానికి పాలాభిషేకం**



**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** వేములవాడ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంకోసం 200 కోట్లతో మంజూరు చేయించినందుకు ప్రభుత్వ విప్పు, శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ చిత్రపటానికి వేములవాడ రూరల్ మండల్ అధ్యక్షులు వకుళాభరణం శ్రీనివాస్, మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేస్తూ పెద్ద ఎత్తున బాణాసంచా పేలుస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడం లక్ష్యంగా అన్ని శాఖలను అభివృద్ధి చేయడానికి నిధులు కేటాయిస్తూ ఈరోజు 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూలు కొరకు నిధులు మంజూరు చేయించినందుకు చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. గడిచిన 10 ఏళ్లలో లేని విధంగా అనేక సంక్షేమ పథకాలను నియోజకవర్గానికి, మండలానికి తీసుకువచ్చి అమలు చేస్తున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వకులాభరణం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాలకుర్తి పరశురాములు, ఎస్సీ సెల్ మండల ప్రెసిడెంట్ నేదూరి రమేష్, యూత్ అధ్యక్షులు రోమాల ప్రవీణ్, మాజీ ఎంపిటిసి హనుమాజీపేట గోవర్ధన్ రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షులు అదిల్ పాషా, వేములవాడ రూరల్ మండలం ఉపాధ్యక్షులు బత్తిని ఎల్ల గౌడ్, మండల ఉపాధ్యక్షులు సోహినేని కరుణాకర్, సల్ల సురేష్, నూకలమర్రి మాజీ సర్పంచ్ పిట్టల వెంకటేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సోమినేని బాలు, దానే వేణు, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి విష్ణు, కొమ్ము రాధాకృష్ణ, చింతల కోటి రాజు, నేదూరి దేవరాజు, నేదూరి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ జయంతి – మహానాయకుడి స్మృతికి కృతజ్ఞాంజలి



**చట్టం, బోధన్:** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, స్వర్గీయ నందమూరి తారక రామారావు 102వ జయంతి సందర్భంగా బోధన్, పంట ఖుర్దు, ఏరాజుపల్లి గ్రామాలలో తెలుగుదేశం పార్టీ శాఖ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి పార్టీ జెండాను ఎగురవేయడం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు మాట్లాడుతూ మన తెలుగు జాతి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానాయకుడు, నందమూరి తారక రామారావు జయంతిని గౌరవంగా జరుపుకుంటున్నాము అని, ఆయన ఒక సామాన్య నటుడు కాదు - ఒక యుగ పురుషుడు. రాముడు, కృష్ణుడు, కర్ణుడు వంటి పురాణ పాత్రల్లో నటిస్తూ దేవతలను తెరపై దించిన నాటకీయ నాటకరంగ వైభవం ఆయనదే అని,కేవలం నటుడిగా కాకుండా, ప్రజల మనస్సుల్లో బలంగా నిలిచిన రాజకీయ నాయకుడిగా ఎన్టీఆర్ జీవితం వెలుగులు చిందించింది. "తెలుగువారి ఆత్మగౌరవం" కోసం ఏర్పరిచిన తెలుగుదేశం పార్టీ ద్వారా ఆయన నేతృత్వం అందిస్తూ కోట్లాది హృదయాలను గెలుచుకున్నారు అన్నారు. ఆయన పరిపాలనలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, పేదల కోసం తీసుకున్న త్యాగపూరిత నిర్ణయాలు ఇప్పటికీ గుర్తింపు పొందుతున్నాయి. ఒక నటుడిగా రాష్ట్ర నాయకుడిగా మారి ప్రజల మనసు గెలవగలడంటే, అది ఆయన గొప్పతనానికే నిదర్శనం అనీ, ఎన్టీఆర్ జయంతి రోజు, ఆయన సేవలను, జీవితాన్ని గుర్తుచేసుకుంటూ, మనమంతా ప్రజా సేవ పట్ల నిబద్ధత, నాయకత్వం పట్ల నమ్మకాన్ని కలిగి ఉండాలి అని, ఆయన మనకి చూపించిన మార్గం - ప్రజల కోసం, ప్రజలతో కలిసి పనిచేసే మార్గం - మనకు స్పూర్తిగా ఉండాలి అని చెప్పారు. ఈకార్యక్రమంలో అడ్హక్ కమిటీ మెంబర్స్ కోట గోపాల్ రెడ్డి, పావులూరి వెంకటేశ్వరరావు, సిహెచ్ వి హనుమంతరావు బోధన్ మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, సచిన్ పటేల్, పట్టణ అధ్యక్షులు బాలగంగాధర్ రావు, పట్టణ కార్యదర్శి సుబ్బారావు తన్నీరు, బోధన్ మండల కార్యదర్శి ఈశ్వరరావు, అల్లం నేని సాయి, రావెళ్ల శ్రీనివాస్, బాబురావు, రామారావు, సుధాకర్ మేస్త్రి, ఎం .రామారావు, వి.వెంకటేశ్వరరావు, గోగినేని సుబ్బారావు, విఠల్, బొగుళ్ళ వినోద్, వై. సత్యనారాయణ, మార్ని రాజా, ఎం రవికుమార్ తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పేరు గొప్ప... ఊరు దిబ్బ...?




**చట్టం పెద్దపల్లి:** మంథని మున్సిపల్ పరిధిలో గల 7వ వార్డులోని మా భగత్ నగర్ దుస్థితి...!వర్షాకాలం రాకముందే కురిసిన ఈ చిన్న వర్షానికే అండర్ గ్రౌండ్ డ్రైనేజి లో వేసిన చిన్న సైజ్ పైపు లైన్లు జామ్ అయి వరద నీరు పోటు కమ్మి ఇండ్లలోకి నీరు వచ్చింది. డ్రైనేజి నిర్మాణం సమయంలోనే పైపుల సైజులు మార్చాలని, పెద్ద పైపులు వేయాలని మున్సిపల్ అధికారులకు ఎంత మొర పెట్టుకున్న... రెండు మూడు వాడల వరద నీరు వచ్చే ప్రధాన డ్రైనేజి లైను పైపుల సైజులు పెంచాలని చెప్పిన పెడ చెవిన పెట్టి, అంతటా ఇదే పైపులు వేస్తున్నామని అంచనాలు మార్పు చేయడం కుదరదు... పైపుల సైజు పెంచేది లేదు అంటూ తేల్చి చెప్పి... పనులు ఆపితే పోలీస్ కేసులు పెడతామని హెచ్చరించిన వైనమిది...!! అయినా వారం రోజుల పాటు మా వాడలో పనులు నిలిపి వేస్తే కొందరు నేతలు పనికట్టుకొని ఇక్కడ పని చేయకుండా మంజూరు లేని పనులను వేరే చోట కాంట్రాక్టర్ తో చేయించారు. మున్సిపల్ అధికారుల సాంకేతిక తప్పిదం... మా వార్డు ప్రజలకు శాపంగా మారిన పరిస్థితి...!దీనిపై మంథని సుందరీకరణ ధ్యేయంగా పనిచేస్తు కోట్లాది రూపాయలను మంజూరు చేపించిన మంత్రి తగు చర్యలు తీసుకొని దిద్దుబాటు చర్యలు చేపట్టాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

## నిజామాబాద్ జిల్లా ఎఐబిఎస్ఎస్ నూతన అధ్యక్షునిగా రామావత్ మోహన్ నాయక్



**చట్టం, నిజామాబాద్ ప్రతినిధి :** హైదరాబాద్‌లో ఎఐబిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు సభవత్ రాములు నాయక్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ అధ్యక్షతన నిజామాబాద్ జిల్లా ఎఐబిఎస్ఎస్ నూతన అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా రామావత్ మోహన్ నాయక్, జనరల్ సెక్రటరీగా పీర్ సింగ్ నాయక్ ను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మోహన్ నాయక్ అధ్యక్షులు మాట్లాడుతూ నాపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష పదవి బాధ్యతలు ఇచ్చినందుకు అందరితో సమన్వయంగా కలిసి పనిచేసి ఐక్యతగా ఉంటానని, బంజారాల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కిషన్ సింగ్ నాయక్, శ్రీ హరి నాయక్, విఠల్ నాయక్, మోహన్ నాయక్, బన్నీ నాయక్, హోమాజీ, రాజు నాయక్, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన బోధన్ ఎమ్మెల్యే



**చట్టం రెంజల్ :** రెంజల్ మండలం సాటాపూర్ గ్రామంలో సామియా కళ్యాణ మండపంలో రెంజల్ వాస్తవ్యుడు బొత్తడి సాయిలు కుమారుని వివాహ కార్యక్రమనికి మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ శుభకార్యానికి మాజీ ఎంపీపీ రెంజల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోబిన్ ఖాన్ హాజరై శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుకలలో బంధువులు, స్నేహితులు, తదితరులు ఉన్నారు.

## లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**చట్టం, బోధన్ :** నిజామాబాద్ జిల్లా సాలురా మండల కేంద్రంలో మండలం లోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం నాడు CMRF(సీఎం రిలీఫ్ ఫండ్) చెక్కులను మండల కాంగ్రెస్ నాయకులు పంపిణి చేయడం జరిగింది. ఈ సందర్భంగా చెక్కులు మంజూరు అయ్యేందుకు కృషిచేసిన శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలుపడం జరిగింది. ఈ కార్యక్రమంలో సాలూర మండల అధ్యక్షులు మందర్న రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వై.నరేందర్ రెడ్డి , బోధన్ ఏఎంసీ చైర్మన్ చిల శంకర్, సాలురా పిఏసిఎస్ చైర్మన్ అల్లే జనార్ధన్, అల్లే రమేష్, అనిల్ వివిధ గ్రామాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నూతన వస్త్రధారణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**చట్టం, బోధన్ :** సాలూరా మండలం హున్స గ్రామ జంగం మట్వాలే ఈరయప్పా మహరాజ్ యొక్క కూతురి, కొడుకు నూతన వస్త్రధారణ మహోత్సవ కార్యక్రమంలో మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి , గడుగు గంగాధర్ పాల్గొని వారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బిల్లా రామ్మోహన్, టీ పీ సీ సీ ప్రతినిది గంగా శంకర్, నాగేశ్వర రావు, బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్, సాలూర సహకార సంఘం చైర్మన్ అల్లే జనార్ధన్, రవి, అల్లే రమేష్, చిద్రపు అశోక్, అనిల్ కుమార్ విద్యార్థి సంఘం నాయకులు ఎన్ స్ యు ఐ, వివిధ హోదాల్లో ఉన్నా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైఖరి కి నిరసనగా తెలంగాణ తల్లికి క్షీరాభిషేకం




**(చట్టం ప్రతినిధి కామారెడ్డి):** రాష్ట్రంలో గురుకుల విద్యార్థుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా బుధవారం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో నీ తెలంగాణ తల్లి విగ్రహానికి పాలతో క్షీరాభిషేకం చేయడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి యువజన సమాఖ్య నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూడడం సిగ్గుచేటు అన్నారు.రోజురోజు రాష్ట్రంలో పరిస్థితి దారుణంగా తయారైందని చెప్పారు. అధికారులు ఏం చేస్తున్నారు ప్రజలకు ఏమీ అర్థం కావడం లేదన్నారు .గత కొద్దిరోజుల క్రితం భిక్కనూరు గురుకులంలో అటెండర్ చనిపోవడం చాలా బాధాకరమన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. చిన్న చిన్న విద్యార్థులతో టాయిలెట్స్ శుభ్రం చేయించడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గురుకులాలు హాస్ట ల్లో వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిచో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, రాజు, సాయిలు, ప్రవీణ్, దేవా, మనోజ్, దిరాజ్, రాము, కళ్యాణ్ , కరణ్ తదితరులు పాల్గొన్నారు

## బక్రీద్ పండుగ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

▶ **జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** బక్రీద్ పండుగను శాంతి యుతంగా, సమగ్రంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన బక్రీద్ పీస్ కమిటీ సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే జూన్ నెలలో జరగనున్న బక్రీద్ పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ని ఈద్గా ప్రదేశాల్లో పిచ్చి మొక్కలను తొలగించి, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. ప్రార్థనలకు వచ్చే ముస్లిం సోదరులకు టెంటులు, షామియానాలు, త్రాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఈద్గా ప్రదేశాల్లో విద్యుత్ సరఫరా పరిస్థితిని పర్యవేక్షించి అవసరమైన చోట మరమ్మతులు చేపట్టి సరఫరా పునరుద్ధరించాలన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు, పుకార్లు వ్యాపించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర హెచ్చరించారు. అన్ని మతపరమైన వేడుకలను అన్నదమ్ములమయిన భావంతో శాంతియుతంగా జరుపుకోవాలని కలెక్టర్ ప్రజలకు సూచించారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా పోలీసు శాఖ తరపున జిల్లాలో పటిష్ఠ భద్రతా చర్యలు చేపడతామని తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో పోలీస్ బలగాలు అప్రమత్తంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లు పైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, పీస్ కమిటీ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మాదిగలు చేసిన సేవలను పార్టీ గుర్తించాలి

▶ **ఎమ్మెల్యే లక్ష్మీకాంత రావు**



**చట్టం ప్రతినిధి కామారెడ్డి :** రాష్ట్ర వ్యాప్తంగా మంత్రివర్గ విస్తరణ వినిపిస్తున్నాయి. ప్రభుత్వం కొలువుదీరి ఏడాదిన్నర కావొస్తున్నా ఈ విషయంలో అధిష్టానం ఇప్పటికీ మీనమేషాలు లెక్కిస్తోంది. తాజాగా సీఎం రేవంత్ రెడ్డి తో పాటు పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తో సమావేశమై మంత్రివర్గ విస్తరణ, రాష్ట్ర కార్యవర్గ అంశాలపై చర్చించిన నేపథ్యంలో ఆశావహుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. ఈ క్రమంలోనే కాంగ్రెస్ లోని మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు అంతా రహస్యంగా భేటీ అవ్వడం చర్చకు దారి తీస్తోంది. వారంతా ఇవాళ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారా ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కలవబోతున్న నేపథ్యంలో ఏం జరగబోతోందనే టెన్షన్ పార్టీ శ్రేణుల్లో నెలకొంది ఈ క్రమంలోనే కేబినెట్ విస్తరణపై జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ఆయన హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడుతూ.. తమ సంఖ్యను బట్టి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం ఉండాలని అన్నారు. తెలంగాణ జనాభాలో 18 శాతం మంది మాదిగలు ఉన్నారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అమలుతో సీఎం రేవంత్ రెడ్డి న్యాయం చేశారని.. రాజీయంగా కూడా గుర్తింపు ఇవ్వాలని కోరుతున్నామని కామెంట్ చేశారు. మాదిగలకు మంత్రి పదవి డిమాండ్ కాదు.. రిక్వెస్ట్ అని అన్నారు. దామోదర రాజనర్సింహ కు అనుభవం దృశ్య మంత్రి పదవి వచ్చిందని.. ఆయన మంత్రి పదవిని కులాల ప్రాతిపదికన చూడాల్సి అవసరం లేదన్నారు. మాదిగలు ఎప్పుడూ కాంగ్రెస్ పక్షానే ఉన్నారని.. భవిష్యత్తులో కూడా ఉంటారని కామెంట్ చేశారు. మాదిగలు పార్టీకి చేసిన సేవలను గుర్తించాలని, ఆకాంక్షను అధిష్ఠానానికి చెప్పేందుకే నిన్నటి మీటింగ్ అని ఎమ్మెల్యే లక్ష్మీకాంత రావు అన్నారు.

## జర్నలిస్ట్ సంఘం ఆధ్వర్యంలో సురవరం ప్రతాపరెడ్డి జయంతి



**చట్టం :శంకరపట్నం :** జర్నలిస్టు రంగానికి వన్నె తెచ్చిన సీనియర్ పాత్రికేయుడు గోల్కొండ పత్రిక సంపాదకుడు సురవరం ప్రతాపరెడ్డి 129వ జయంతి వేడుకలు బుధవారం శంకరపట్నం మండలం కేశవపట్నం అంబేద్కర్ విగ్రహం వద్ద శంకరపట్నం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కోరేం శ్రీనివాస్ రెడ్డి, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సురవరం ప్రతాపరెడ్డి, చిత్రపటానికి తాసిల్దార్ సురేఖ మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్, ఆలయ చైర్మన్ ఉప్పుగల్లు మల్లారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బసవయ్య గౌడ్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట మైపాల్ ఏ ఎస్ ఐ సుధాకర్, మాజీ ప్రజా ప్రతినిధులు దొంగల రాములు, గట్టు తిరుపతి గౌడ్,గాండ్ల తిరుపతి, మోత్కూరి సమ్మయ్య,రసమళ్ళ శ్రీనివాస్, జర్నలిస్టులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జయంతి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, కొరిమి వెంకటస్వామి, దేవునూరి రవీందర్, బూర్ల వెంకటేష్, నేరెళ్ల సంతోష్, కొరిమి సంతోష్, కత్తెరమళ్ళ కిరణ్,చింతం వెంకటేష్, గొర్ల అనిల్, తాళ్లపల్లి సాగర్, ఎల్కపల్లి సుధీర్, సంపత్ రెడ్డి, రాకేష్, తుమ్మ సుధాకర్, సురేష్, ప్రణదీప్, రంజిత్, తిరుపతి, అనిత్, గట్టయ్య, నరేష్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్లతో తాసిల్దార్ కార్యాలయంలో సమావేశం



**చట్టం మద్నూర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీలో వచ్చే మూడు నెలల కోటాను ముందస్తుగా పంపిణీ చేస్తున్న సందర్భంగా మండలంలోని రేషన్ డీలర్లతో మద్నూర్ మండలం తాసిల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మూడు నెలల కోట పంపిణీలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, రైస్ పక్కదారి పట్టకుండా, ప్రజలకు అసౌకర్యం కలిగించకుండా రేషన్ బియ్యం పంపిణీ చేయాలని మండల నయాబ్ తహసిల్దార్ శివరామకృష్ణ అదే విధంగా మండల గిర్దవార్ ఏం శంకర్ లు డీలర్లకు ఆదేశించారు.

## సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న సులబ్ కార్మికులు



**చట్టం రామగుండం :** సింగరేణిలో సుమారు 200 మంది సులభ కార్మికులు ఇంటర్నేషనల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఏజెన్సీ ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్నారు. వీరికి చట్టబద్ధమైన హక్కులు, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి డీజీఎం పర్సనల్ కిరణ్ బాబు కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీలు కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (IFTU) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ వెంకన్న మాట్లాడుతూ.. సింగరేణి వ్యాప్తంగా సుమారు 200 మంది సులబ్ కార్మికులు సులబ్ ఇంటర్నేషనల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఏజెన్సీ ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్నారని ఈ సులబ్ కాంప్లెక్స్ లను సింగరేణి యాజమాన్యం నిర్వహిస్తుందని ఒక్కొక్క సులబ్ కాంప్లెక్స్ కు నెలకు సుమారుగా 25 వేల రూపాయలు సులబ్ ఇంటర్నేషనల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఏజెన్సీకి సింగరేణి యాజమాన్యం చెల్లిస్తుందని ప్రతి కాంప్లెక్స్ కు ఒక కాంట్రాక్టు కార్మికుడు 30 రోజులపాటు పనిచేస్తున్నాడని కానీ ఈ కార్మికులకు ఎలాంటి భద్రత లేదని ప్రస్తుతం సింగరేణి యాజమాన్యం ఇతర కాంట్రాక్టు కార్మికులకు అమలు చేస్తున్నట్టు హెచ్ డి ఎఫ్ సీ బ్యాంకు ద్వారా సులబ్ కాంప్లెక్స్ లో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు కూడా ఎక్స్ గ్రేసీయా సౌకర్యం కల్పించాలని, పెండింగ్లో ఉన్న ఏరియర్స్ ని తక్షణమే చెల్లించాలని, ఈ ఎస్ ఐ, పి ఎఫ్ అమలు చేయాలని ఇతర కాంట్రాక్టు కార్మికులకు చెల్లించినట్లుగా 8.23% బోనస్ అమలు చేయాలని, పని భద్రత కల్పించాలని, చాలా సులబ్ కాంప్లెక్స్ అసౌకర్యంగా ఉన్నాయని వెంటనే వాటిని రిపేర్ చేయించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ వినతి పత్రం ఇచ్చిన కార్యక్రమంలో ఐ ఎఫ్ టీ యు జిల్లా అధ్యక్షులు ఈ నరేష్, సింగరేణి కాలరీస్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ (IFTU) రాష్ట్ర ఉపాధ్యక్షులు బి అశోక్, రాష్ట్ర ఆర్గనైజన్ సెక్రెటరీ ఐ రాజేశం, రీజియన్ నాయకులు పులిపాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీపిసి రామగుండంలో బాలిక సాధికారత వేడుకలు



**చట్టం రామగుండం :** కాకతీయ ఫంక్షన్ హాల్‌లో ఉత్సాహభరితమైన సాంస్కృతిక కార్యక్రమంతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమం లో సంయుక్త మహిళా సమితి సీనియర్ సభ్యురాలు సునీత జైకుమార్ శ్రీనివాసన్, దక్షిణ్ దీపాంజలి మహిళా సమితి అధ్యక్షురాలు రంజనా దువా, ఎన్టీపిసి రామగుండం తెలంగాణలో బాలికా సాధికారత మిషన్ (జెమ్) వర్క్‌షాప్ 2025 కి హాజరయ్యారు. ఈ కార్యక్రమం లో నృత్య ప్రదర్శనలు, పాటలు, ప్రసంగాలు, స్కిట్ లు, యోగా, కరాటే ద్వారా తమ ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత కూడా వర్క్‌షాప్ సమయంలో వారు పెంచుకున్న సానుకూల అలవాట్లను ముందుకు తీసుకెళ్లమని శ్రీనివాసన్ వారిని ప్రోత్సహించారు. మొబైల్ ఫోన్ వినియోగాన్ని పరిమితం చేయాలని,వారి అభ్యాస అనుభవాలను స్నేహితులతో పంచుకోవాలని ఆమె వారిని కోరారు. మే 28న ప్రముఖులు తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మమేకమై వారి అభ్యసనలను అడిగి తెలుసుకున్నారు. వారు విద్యార్థుల కళాకృతులను పరిశీలించి, వారి అంకితభావం, సృజనాత్మకతకు మెచ్చి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు చాక్లెట్లను పంపిణీ చేశారు. వారు డార్మిటరీలు, డైనింగ్ ఏరియా, కంట్రోల్ రూమ్‌తో సహా జెమ్ వేదికను కూడా పరిశీలించారు. ఎన్టీపిసి రామగుండం యాజమాన్యం వారి అద్భుతమైన ఏర్పాట్లు, హృదయపూర్వక ప్రయత్నాలకు మెచ్చుకున్నారు. జెమ్ అమ్మాయిలకు వారి ఆకాంక్షలను ఎక్కువ దృష్టితో కొనసాగించాలనే తాజా ప్రేరణ, దృఢ నిశ్చయంతో నింపింది. వారి స్ఫూర్తిదాయకమైన చెట్ల పెంపకం కార్యక్రమంతో ఈవెంట్ ముగిసింది.

# మానవ అక్రమ రవాణ నిర్మూలించడం మన అందరి బాధ్యత

- పెద్దపల్లి జిల్లా విద్యాశాఖ అధికారిని మాధవి,ప్రజ్వల సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ కృష్ణ




**చట్టం పెద్దపల్లి:** మనుషుల అక్రమ రవాణా నిర్మూలన లో ప్రజలు అందరు భాగస్వామ్యం అయినప్పుడే దీనిని సమూలంగా నివారించవచ్చు అని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ,రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా మండలి సంస్థ ఆధ్వర్యంలో ZPHS జెడ్ పి హెచ్ ఎస్ (జి) హాస్టల్ పెద్దపల్లి నందు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ. డి ఈఒ మాధవి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచం వ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తూ ఎంతో మంది అమ్మాయిల జీవితాలను నాశనం చేస్తున్న నేరపూరితమైన చర్య. దీనికి పేద మధ్య తరగతి అమ్మాయిలు, మహిళలు ఎక్కువ గా గురి అవుతున్నారు. సమాజంలో ప్రజలతో, విద్యార్థులతో సన్నిహితంగా ఉండి గమనించి వారికి అవగాహనా కల్పించాలి, ముక్యంగా పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్స్ లో వారికి అవగాహనా కల్పించాలి. సైబర్ ట్రాఫికింగ్ అనేది చాలా వేగంగా విస్తరిస్తున్న జటిలమైన సమస్య కాబట్టి పిల్లలకు ఫోన్ ఉపయోగించడం ద్వారా వచ్చే నష్టాలను తెలియజేయాలి అని అన్నారు. సమాజంలో ఉన్న చాలా సమస్యలకు ఆర్థిక కారణలా తో పాటు, సామజిక కారణాలు దోహదం చేస్తాయి, మన చుట్టుపక్కల ఉండే ఇలాంటి వాళ్ళను ట్రాఫికెర్స్ టార్గెట్ చేసి, మాయమాటలు, ఉద్యోగం సినిమా అవకాశం అంటూ పట్టణాలకు తీసుకెళ్లి వ్యభిచార గృహాలలో అమ్ముతున్నారు, కాబట్టి మన డిపార్ట్మెంట్ జిల్లా నుండి గ్రామ స్థాయి వరకు అందరు అవగాహనా కలిగి ఉండి, అప్రమతం చేయడం ద్వారా దీన్ని నిర్మూలించవచ్చు. బలరామ కృష్ణ మాట్లాడుతూ... మానవ అక్రమ రవాణాను ఆదిలోనే అడ్డుకుంటే మన ఆడపిల్లలను రక్షించు కోవచ్చు, ప్రతి రోజు ఎంతో మంది అమ్మాయిలు మహిళలు దీని బారిన పడుతున్నారు. ముక్యంగా యువత, పిల్లలు ఆకర్షణకు గురి అయి, పట్టణాలకు వచ్చి వ్యభిచార గృహాలలో అమ్మబడుతున్నారు. ప్రజ్వల సంస్థ ద్వారా ఇప్పటి వరకు 30 వేల మంది అమ్మాయిలను మహిళలను కాపాడడం జరిగింది. ఇందులో చిన్న పిల్లలు, యువతులు ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారు. సైబర్ ట్రాఫికింగ్ ద్వారా ఈ అక్రమ రవాణా చాలా పెరిగి పోయింది, ముక్యంగా విద్యార్థులు అనవసరం అయినా అప్స్ ద్వారా పర్సనల్ ఫొటోస్ వీడియోస్ పంపడం ద్వారా సెక్స్ ట్రాఫికింగ్ కి గురి అవుతున్నారు. మీరు జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు ఉన్న మన సిబ్బంది ఈ విషయాలపై అవగాహనా పొంది ఇతరులకు అవగాహనా కల్పించాలని సూచించారు. ఈ శిక్షణలో మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం ఎలా జరుగుతుంది, బాధితురాలి పైన ఉండే ప్రభావాలు, సైబర్ అదారిత అక్రమ రవాణా, చట్టాలు బిఎన్ఎస్,ఐ పి టి ఎ , పోక్సో, పి సి ఎం ఎ, సఖి, భరోసా, చైల్డ్ లైన్, పోలీస్ టోల్ ఫ్రీ నంబర్స్ 1098, 100, 181, 1930, 181ల గురించి చెప్పడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా విద్యాశాఖ అధికారిని మాధవి, ప్రజ్వల ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ కృష్ణ, జీసీడిఓ కవిత, జెడ్ పి హెచ్ ఎస్ గర్ల్స్ ప్రిన్సిపాల్ అరుణ ప్రజ్వల సిబ్బంది అంబర్ సింగ్, పెద్దపల్లి నుండి కేజీబీవీ,మోడల్ స్కూల్, రెసిడెన్సియల్ స్కూల్, నుండి స్కూల్ అసిస్టెంట్ టీచర్ పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**చట్టం / పరకాల :** పరకాల పట్టణ కేంద్రంలోని భూపాలపల్లి రోడ్డులో ఆర్ఆర్ గార్డెన్లో జరిగిన పరకాల మండల పరిధి లోని నార్లపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న తాటికొండ మౌనిక వివాహనికి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించడం జరిగింది. పరకాల ఎమ్మెల్యే వెంట పరకాల, నడికుడ మండల అధ్యక్షులు కట్కూరి దేవేందర్ రెడ్డి,బుర్ర దేవేందర్ గౌడ్, పరకాల పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ ,శ్రీ కుంకుమేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ కొలుగురి రాజేశ్వర్ రావు, మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచ్ పర్నెం మల్లారెడ్డి, కోతపెల్లి రవి,చాడ తిరుపతి రెడ్డి, ఎస్సీ విభాగం అధ్యక్షులు బొమ్మకంటి చంద్రమౌళి, ఎఎంసి డైరెక్టర్ దాసరి బిక్షపతి, పరకాల పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ మంద నాగరాజు, ఏజీపీ లక్కం శంకర్, కాంగ్రెస్ నాయకులు ఎకు రవికుమార్,ఎండి షఫీ,గోవింద సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తూ జాగ్రత్త చర్యలు




**చట్టం భీంగల్ :** నిజామాబాద్ జిల్లా భీంగల్ పట్టణ కేంద్రంలోని ఒకటో వార్డులో అయ్యప్ప నగర్ లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలో భాగంగా మురికి కాలువలను జెసిబి తో బుధవారం శుభ్రం చేయడం జరిగిందని మున్సిపలు కమిషనర్ గోపు గంగాధర్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షపు నీరు నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు ఈ వర్షాకాలంలో భారీ వర్షా పాత నమోదు సూచనల కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ సిబ్బందిలు కమిషనర్, ముందస్తు జాగ్రత్త చర్యలు జరిపారని తెలిపారు.

## నూతన వస్త్రాలంకరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



**చట్టం జుక్కల్:** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం పిట్లం మండల కేంద్రంలోని సాయి గార్డెన్ ఫంక్షన్ హాల్ లో వడ్లం గిరి పటేల్ కుమారుల నూతన వస్త్రాలంకరణ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు హనుమంత్ షిండే పాల్గొన్నారు ఇట్టి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తో పాటు మాజీ ఎంపీపీ ప్రతాప్ రెడ్డి మరియు మండల టిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లాబ్దిలో ఖండోబా విగ్రహ ప్రతిష్టాపన



**చట్టం, బాసర :** నిర్మల్ జిల్లా బాసర మండలం పరిధిలోని లాబ్ధి గ్రామంలో బుధవారం ఖండోబా విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మాజీ శాసన సభ్యులు బోస్లే నారాయణరావు పటేల్ కార్యక్రమానికి హాజరైనారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం యోగేష్ మహారాజ్ ఆధ్వర్యంలో హరి భక్త కీర్తన ఉండడంతో గ్రామస్తులు భక్తిపరవశంతో కండోభ నూతన ఆలయ ప్రాంగణం భక్తి పౌరుషంతో కరకరలాడింది అంతకుముందు వేదమంత్రాల మధ్య విగ్రహ ప్రతిష్టాపన చేయగా భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వారితో పాటు ఈ కార్యక్రమం లో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్ చంద్రే, ముత్యం రెడ్డి, బాసర మండల అధ్యక్షులు ముమ్మాయి రమేష్, మాజీ సర్పచ్ కేశవ్ దేవిధాస్ భక్తి భజన, పారాయణ కీర్తనకారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం తడవకుండా రైతులు నష్టపోకుండా చూడాలి



**చట్టం వికారాబాద్ ప్రతినిధి :** వరి ధాన్యం తడిసి రైతులకు నష్టం వాటిల్లకుండా ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు చేరవేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ తన చాంబర్ లో వరి ధాన్యం సేకరణ, ధాన్యాన్ని మిల్లర్లకు చేరవేయటం, రవాణా సదుపాయం వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రుతుపవనాలు ముందుగానే వచ్చినందున వర్షాలు కురియడం జరుగుతుందని దీనివల్ల ధాన్యాన్ని ఆరబెట్టడం ఇబ్బంది అవుతుందన్నారు. తేమ శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ రైతులకు నష్టం వాటిల్లకుండా వరి ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు చేరవేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. వరి ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు చేరవేసేందుకు అదనంగా లారీలను, హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లర్లకు చేరవేయాలని అధికారులకు సూచించారు. సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ డిఎంసిఎస్ రాము, జిల్లా రవాణా అధికారి వెంకట్ రెడ్డి, పౌరసరఫరాల అధికారులు, ట్రాన్స్పోర్టర్లు పాల్గొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ కలిసి దారు వ్యవసాయ మార్కెట్ గిడ్డంగి ఆవరణలో, పెద్దేముల్ మండలం మంబాపూర్ వరి కొనుగోలు కేంద్రాల లో ఆరబెట్టిన వరి ధాన్యాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులకు నష్టం జరగకుండా ధాన్యాన్ని మిల్లులకు చేర్చే విధంగా చర్య తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు.

## డిఎస్పీని సన్మానించిన మలిదశ ఉద్యమకారులు




**చట్టం నసురుల్లాబాద్:** కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో బుధవారం రోజు బాన్సువాడ డి.ఎస్.పి విఠల్ రెడ్డిని మల్లీ దశ ఉద్యమకారులు మర్యాదపూర్వకంగా కలిసి శాల పూలమాలతో సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ఉడుత గంగాధర్ గుప్తా, మండల ప్రధాన కార్యదర్శి గంజి వార్ చందు, భీమ్ నాయక్, కృష్ణ ,కాల్వ శ్యామ్ భాస్కర్ గౌడ్, ఎర్రవట్టి సాయిబాబా, పవన్, మహేష్ వెంకటి, తోటి ఉద్యమకారులు కలిసి, ప్రత్యేక సన్మానం చేశారు.

## ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలి : విద్యార్థి సంఘాలు



**చట్టం నసురుల్లాబాద్ :** కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో పి డి ఎస్ యు, టి ఎస్ పి, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘాల వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు ఎన్. బాల్ రాజ్, టి ఎస్ పి జిల్లా అధ్యక్షులు మావురం శ్రీకాంత్ మాట్లాడుతూ 202526 కు గాను విద్యాసంవత్సరం మొదలవబోతుంది. జూన్ 12 నుండి విద్యాసంస్థలు పున ప్రారంభం కాబోతున్నాయి. ప్రభుత్వం ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకునే పేద, మధ్యతరగతి, విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ప్రతి విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవసరమైన కనీస వసతులు, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యాలు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, ఫ్యాన్ లు, కంప్యూటర్ ల్యాబ్స్ పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని అదేవిధంగా జూన్ 12 న విద్యాసంస్థలు ప్రారంభం నుండే ప్రభుత్వం విద్యార్థులకు వెనువెంటనే పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ లు సకాలంలో పూర్తి స్థాయిలో అందించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో PDSU (s) నాయకులు రమేష్, సాయి, లక్ష్మణ్ TSP నాయకులు విట్టల్ అరవింద్ లు పాల్గొన్నారు.

## నసురుల్లాబాద్ మండల కేంద్రంలో తీరంగ యాత్ర




**చట్టం నసురుల్లాబాద్ :** ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన సందర్భంగా కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండల కేంద్రంలో నసురుల్లాబాద్ బస్టాండ్ నుండి రామ్ మందిర్ వరకు ర్యాలీ నిర్వహించారు, ఈ ర్యాలీలో ఆర్మీ జవాన్లు, పాల్గొన్నారు. అలాగే రాజకీయాలకు అతీతంగా యువకులు పెద్దలు భారీ సంఖ్యలో పాల్గొని ఈ ర్యాలీలో పాల్గొన్న ఆర్మీ జవాన్లకు ప్రత్యేక సన్మానం చేశారు, ఈ ర్యాలీలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## పార్టీ కోసం పని చేసే వారికే ప్రాధాన్యత.. గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కే. తిరుపతి




**చట్టం ధర్పల్లి:** కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడే పని చేసే ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందని, సంస్థ గత ఎన్నికల అబ్జర్వర్ గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కొట్నూరు తిరుపతి సూచించారు. బుధవారం సంస్థ గత ఎన్నికల్లో భాగంగా ,ధర్పల్లి మండల కేంద్రంలోని గురడి కాపు కళ్యాణ మండపంలో కాంగ్రెస్ మండల పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఇందల్వాయి ధర్పల్లి సిరికొండ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గ్రామ శాఖ అధ్యక్షులు కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సంస్థ గత ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన దృశ్య గ్రామీణ ప్రాంతాల్లో పదవులు కావాలనే వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. నాయకులు కార్యకర్తలు విభేదాలు వీడనాడి సమన్వయంతో పనిచేసినప్పుడే రాబోయే ఎన్నికల్లో విజయం సాధిస్తామని తిరుపతి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు బీవీ. నరసింహారావు మానాల మోహన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు తాహెర్ ,మండల పార్టీ అధ్యక్షుడు చిన్న బాలరాజ్ ఎం. గంగారెడ్డి సిహెచ్. నరసయ్య సిహెచ్ .శ్రీనివాస్ పి .సుభాష్ మండల కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు కూడా అంత కష్టమా..!

- గ్రామంలో స్మశాన వాటిక రహదారి లేక ఇబ్బందులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు




**చట్టం, తానూర్ :** ఆ గ్రామంలో ఎవరైనా అకస్మాత్తుగా ప్రమాదవశత్తు సంఘటనలు ఎవరైనా చనిపోతే అంత క్రియలకు కష్టంగా మారింది. ఇది ఎక్కడో కాదు నిర్మల్ జిల్లా తానూరు మండలం జారి (బి) గ్రామంలో ఓ మనిషి చనిపోవడంతో గత మూడు రోజుల నుండి ఇక దాటిక వర్షాలు కురవడంతో ఆ గ్రామంలో సరిగ్గా స్మశాన వాటిక లేకపోవడంతో సుమసనవాటికకు చేరుకోవాలంటే సరైన రహదారి ఉండకపోవడం వలన మొత్తానికి శవాన్ని కూడా కష్టంగా వర్షపు నీటిలో ఆఖరి మజిలీకి శవం తోడకుండా వారిని కప్పుకొని తీసుకెళ్లడం ఆశ్చర్యానికి గురిచేసింది సోషల్ మీడియాలో ఓ వీడియో ద్వారా ఈ సంఘటన చెక్కర్లు కొడుతుండగా ఈ ఘటన చట్టం పత్రికకు చిక్కింది. ఈ నేపథ్యంలో నిర్మల్ జిల్లా తానూర్ మండలం జారి(బి) గ్రామంకు చేరుకోవాలంటే బోల్సా నుండి దాదాపు పది కిలోమీటర్ల మేర గ్రామం ఉంటుంది. ఆ గ్రామానికి ఇప్పుడు కూడా రహదారి సరిగ్గా లేకపోవడంతో పాటు గత కొన్ని సంవత్సరాల నుండి ఇదే తంతు ఉండడం వలన గ్రామస్తులు ఎన్నో సార్లు ప్రజా ప్రతినిధులు పాలకులు ఉన్నతాధికారులకు విన్నవించిన కనీసం గ్రామానికి ప్రధాన రహదారి రోడ్డు వేయకపోవడం ఇరువైపులా దట్టమైన అడవి ప్రాంతం సాయంకాలం కాగానే గ్రామానికి చేరుకొని ఇంటికి వెళ్లే దాక భయభ్రాంతులతో ప్రాణం పనంగా పట్టుకొని ఇప్పటికి కూడా కాలినడకన నడుస్తూ నరకయాతన చూస్తున్నామని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా మా గ్రామ పరిస్థితి విడ్డూరకరంగా మారింది. బోల్సా గ్రామం నుండి రహదారిపై వెళ్లేటప్పుడు జరీ గ్రామానికి గత కొన్ని సంవత్సరాల నుండి ఇప్పటివరకు బస్సు కూడా ఉండదు ఆటోలో వెళ్లాలంటే కష్టంగా ఉంది. ఇప్పటివరకు గ్రామానికి చేరుకోవాలంటే ఘాట్ లాగా ఎత్తైన కొండలు ఉండడంతో మేము రజకర్ల జమనోల్లో ఉన్నామా అంటూ అక్కడి గ్రామస్తులు తమ ఆవేదనతో పాటు కన్నీరు మున్నీరు అవుతున్నారు. ఇప్పటికైనా తమ సమస్యలు నెరవేర్చేలా ఉన్నత అధికారులతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి మా సమస్యలను పూర్తి చేయాలని గ్రామస్తులు తమ ఆవేదన వ్యక్తం చేశారు.

## 'నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్'కు నాళేశ్వర్ గ్రామం ఎంపిక




**నవీపేట్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సహజ వ్యవసాయ పద్ధతుల కేంద్ర ప్రభుత్వ జాతీయ స్థాయి పథకం 'నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్' (ఎన్ఎంఎన్ఎఫ్)కు నవీపేట మండలం లోని నాళేశ్వర్ గ్రామాన్ని ఎంచుకోవడం జరిగింది... మంగళవారంవ్యవసాయ అధికారులు ఏవో నవీన్, ఏ ఈ ఓ వసంత్ కుమార్,ఁతాజా మాజీ సర్పంచ్ బిజెపి మండల అధ్యక్షులు ద్యాగ సరిన్, మాజీ సర్పంచ్ నర్సింగరావు, ప్రవీణ్, పోతన్న , రమేష్, సంపత్, భోజరాం ,రైతులు, మహిళాలు, ప్రజలు తదితరులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి ఏవో నవీన్ కుమార్ మాట్లాడుతూ రైతులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సేంద్రియ వ్యవసాయంలో పాల్గొని మొదటి దశగా 125 రైతులను ఎంపిక చేసి ప్రతి రైతు ఒక ఎకరం సేంద్రియ వ్యవసాయాన్ని పండించాల్సిందిగా సూచించారు.. దీనికి సంబంధించిన వివరాలు తెలియజేయడానికి ఇద్దరు మహిళ రైతులను నియమించాలని ఈ వివరాలు ఏఈఓ వసంత్ కుమార్ కి ఇవ్వాల్సిందిగా కోరారు.. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సదుపాయాలు సమకూరుస్తూ భూసార పరీక్షలు నిర్వహించి సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం గురించి త్వరలో వారికి విషయాలు వెల్లడిస్తామని అన్నారు. ఈ సందర్భంగా నాళేశ్వర్ తాజా మాజీ సర్పంచ్ బిజెపి మండల అధ్యక్షులు మాట్లాడుతూ నాళేశ్వర్ గ్రామంలో సేంద్రీయ వ్యవసాయానికి మా గ్రామం ఎంపిక కావడం చాలా సంతోషం గోదావరి నది తీరాన ప్రాంతం పాడి పశువు అత్యధికంగా ఉండే ప్రాంతం ప్రోత్సహిస్తే ఇప్పటికే కొందరు రైతులు సేంద్రియ వ్యవసాయంలో ఉన్నారు.. ఇంకా ప్రోత్సహిస్తే రానున్న రోజుల్లో సేంద్రియ వ్యవసాయానికి కేంద్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చే సలహాలను సహకరిస్తూ ప్రతి ఒక్కరు సేంద్రియ వ్యవసాయం చేస్తారని తమ ఆరోగ్యాలతో పాటు ప్రజల ఆరోగ్యాలు కూడా సేంద్రియ వ్యవసాయం ద్వారా పాడి పంటలు బాగుంటాయి. ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని ప్రారంభించిన నరేంద్ర మోదీ కి ధన్యవాదాలు తెలిపారు.

## బాన్సువాడ కాంగ్రెస్ మీటింగ్ రసాభాస



**చట్టం ప్రతినిధి కామారెడ్డి :** బాన్సువాడలో జరిగిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం ఉద్రిక్తతలకు దారితీసింది.బాన్సువాడలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. అయితే, ఈ సమావేశానికి ఆహ్వానించలేదని ఆరోపిస్తూ, ఏనుగు రవీందర్ రెడ్డి వర్గం నేతలు సమావేశం గేటు ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. చివరకు కాంగ్రెస్ జిల్లా నేతలు జోక్యం చేసుకొని ఇరువర్గాలను సముదాయించారు.

## కొలిమి గోపాల్ రెడ్డి దినకర్మకు హాజరైన ఎమ్మెల్యే పోచారం



**చట్టం నసురుల్లాబాద్ :** కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండల పరిధిలో మైలారం గ్రామంలో సమీప బంధువు కోమలి గోపాల్ రెడ్డి దినకర్మకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరై చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, పోచారం సురేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, బాన్సువాడ నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన సోదా రామకృష్ణ



**చట్టం / పరకాల :** పరకాల పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ రాజిపేట కాలనీకి చెందిన ఏకు నరేష్ రాణి, బండారి అంజలి సందీప్ వివాహ మహోత్సవ కార్యక్రమంలో పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ పాల్గొని ఈ నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్స్ పసుల రమేష్, మార్క రఘుపతి గౌడ్, ఏకు రాజు, నాయకులు ఎల్తూరి శ్రీనివాస్, ఒంటేరు శరత్ బాబు, ఒంటేరు చక్రి, బొచ్చు రాజు తదితరులు పాల్గొన్నారు.

## బిచ్కుంద సొసైటీలో జిలుగు విత్తనాల పంపిణీ




**చట్టం బిచ్కుంద :** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలోని రైతు సేవ సహకార సంఘం నందు జీలుగు విత్తనాలు సొసైటీ చైర్మన్ ఎన్ బాలు చేతుల మీదుగా ప్రారంభించినారు ,ఒక జిలుగు బ్యాగు 30 కేజీ లు ఆ బ్యాగు ఖరీదు రూపాయలు 2137.50 ఉంటుంది ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ తో పాటు వైస్ చైర్మన్ యాదవ్ రావు ,డైరెక్టర్ శివరాజ్ పటేల్ ,చంద్రకాంత్ పటేల్ శంకర్ నాయక్ , మతమల్ మారుతి ఈవో శ్రీలేఖ ,సీఈవో శ్రావణ్ పటేల్ మరియు రైతులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ గారి విగ్రహం ఆవిష్కరించిన పోచారం




**చట్టం న్యూస్ మోస్రా / వర్ని :** ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బాన్సువాడ రూరల్ మండలం కోనాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి తదుపరి గ్రామంలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘ సభ్యులు ప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీల అందచేత



**చట్టం న్యూస్ మోస్రా :** ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని బాన్సువాడ నియోజకవర్గ పరిధి లోని మోస్రా మండలం గోవూర్ గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ కాపీలను గోవూర్ గ్రామపంచాయతీ ఆవరణలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులైన బి .హనుమంత్ రెడ్డి, పాల్వంచ రామ్ రెడ్డి, వై.గంగారం, పి. సుజాత, ఎస్. అరుణ,సహకార సొసైటీ చైర్మన్ పొట్టం గారి సుధాకర్ రెడ్డి,గ్రామపంచాయతీ సెక్రటరీ రాజశేఖర్, ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుంది ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**చట్టం /పరకాల :** రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుంది అని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. బుధవారం గీసుగొండ మండలం అనంతారం గ్రామంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో శాస్త్రవేత్తలు,వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ విధానంలో ఉత్పత్తి పెంచుకొని ఆదాయం పొందాలని రైతులు కాలానికి అనుగుణంగా మారాలి అని,పంట మార్పిడి తో అత్యధిక దిగుబడి వచ్చి లాభాలు ఆర్జించవచ్చు అన్నారు. రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయడం వల్ల ఉపయోగం ఉంటుందన్నారు. నిత్యం ఫెర్టిలేజర్ ఎరువుల పై ఆధారపడటం వల్ల భూసారం దెబ్బతింటుందన్నారు.రైతులు శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు సూచనలు తీసుకోవడం వల్ల రైతులకు ఉపయోగం ఉంటుందన్నారు.ప్రతి మండలంలో 125 ఎకరాల భూమిలో సేంద్రియ వ్యవసాయం చేసి రైతులను చైతన్యం చేయబోతున్నామని అన్నారు.వ్యవసాయం లో నూతన సాంకేతికత ఉపయోగం పెరిగింది అని రైతులు ఆవిధంగా ఆలోచన చేయాలి అన్నారు.పాడి పరిశ్రమల అభివృద్ధికి తాను కృషి చేస్తున్నానని దాని ద్వారా ఎరువులు సేంద్రియ వ్యవసాయం లభ్యమవుతుందన్నారు.

